ప్రజాశక్తి



శనివారం 11 ఫిబ్రవరి 2023 | 5 | శ్రీకాకుళం

ధాన్యం కొనుగోలు చేయాలి


శ్రీకాకుళం : శ్రీకాకుళం రూరల్, గార మండలాల్లో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని వైసిపి యువనేత ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పి.జయంతిని కోరారు. గార, రూరల్ మండలాలకు చెందిన రైతులు, వైసిపి నాయకులతో శుక్రవారం ఆమెను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చేయకపోవడం కళ్లాల్లో దాచుకోలేని పరిస్థితి వస్తుందన్నారు. ఈనెలాఖరుకు రైతుల నుంచి పూర్తిస్థాయిలో కొనుగోలు చేసేలా చూడాలని కోరారు. పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పి.జయంతి మాట్లాడుతూ రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో గార ఎంపిపి గొండు రఘురాం, ఎఎంసి చైర్మన్ మూకళ్ల తాతబాబు, జెడ్‌పిటిసి ప్రతినిధి ఎచ్చెర్ల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆసరా ఎప్పుడో..?

- డిసెంబరులోనే అర్హుల గుర్తింపు ప్రక్రియ పూర్తి
- జమ కాని మూడో విడత రుణమాఫీ సొమ్ము
- జిల్లాలో 4.18 లక్షల మంది ఎదురుచూపులు

డ్వాక్రా రుణాల మాఫీ అమల్లో భాగంగా స్వయం సహాయక సంఘాల మహిళలకు (ఎస్‌హెచ్‌జి) ఆసరా పేరుతో వైసిపి ప్రభుత్వం పొదుపు మహిళలకు రుణమాఫీ చేస్తూ వస్తోంది. 2019 ఏప్రిల్ 11వ తేదీ నాటికి లింకేజీ రుణాలు తీసుకున్న సంఘాల్లోని సభ్యులకు దీన్ని వర్తింపజేస్తున్నారు. నాలుగు విడతలుగా రుణమాఫీ అమలు చేయనుండగా, ఇప్పటివరకు రెండు విడతల మొత్తాన్ని పొదుపు సంఘాల ఖాతాల్లో జమ చేశారు. గతేడాది డిసెంబరులో ప్రతి సభ్యురాలి బయోమెట్రిక్ కూడా తీసుకున్నారు. సంక్రాంతి లోపు లబ్ధిదారుల ఖాతాలో ఆసరా డబ్బులు పడతాయని చెప్పినా, ఇప్పటివరకు జమ కాకపోవడంతో లబ్ధిదారులు ఎదురుచూపులు చూస్తున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి



జిల్లాలో 38,647 సంఘాల్లోని 4,31,734 మంది సభ్యులు ఆసరా ద్వారా తొలి విడతగా లబ్ధి పొందారు. వారి ఖాతాల్లో సుమారు రూ.280.36 కోట్లు జమ అయ్యాయి. మొదటి విడతలో సంఘంలోని సభ్యులందరికీ డబ్బులు ఇచ్చారు. రెండో విడతలో కొన్ని మార్పులు చేశారు. రెండు మూడు ఖాతాల్లో ఉన్న వారిని, మరణించిన సభ్యులను తొలగించి జాబితా రూపొందించారు. రెండో విడతలో 38,805 సంఘాల నుంచి 4,18,397 మంది అర్హత సాధించారు. వారికి రూ.282.36 కోట్లను ఇచ్చారు. మూడో విడతలో మరింత వడపోశారు. బయోమెట్రిక్ నమోదు తప్పనిసరి అని నిబంధన విధించారు. బయోమెట్రిక్, బ్యాంకు ఖాతాల వివరాలను సేకరించారు. గతేడాది డిసెంబరులోనే అన్ని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వెలుగు ఎపిఎంలు, సిసిలు, విఒఎలు గ్రామాల వారీగా ఇకెవైసి ప్రక్రియను పూర్తి చేశారు. మూడో విడత ఆసరాకు 38,804 సంఘాల్లోని 4,18,393 మంది సభ్యులను అర్హులుగా గుర్తించారు. వీరికి నగదు చెల్లించడానికి రూ.284 కోట్లు అవసరం అవుతుందని ఉన్నతాధికారులకు నివేదించారు.

వ్యక్తిగత ఖాతాలకు నగదు జమ

మొదటి రెండు విడతల్లో ప్రభుత్వం ఇచ్చిన రుణమాఫీ సొమ్మును సభ్యులందరికీ కలిపి సంఘం ఖాతాలో నగదు జమ చేశారు. కొన్ని సంఘాలకు చెందిన లీడర్లు తక్కువ మొత్తంలోనే డబ్బులు జమ అయ్యాయంటూ మిగతా సభ్యులకు నగదు తగ్గించి ఇచ్చారు. దీనిపై మిగతా మహిళలు అప్పట్లో ఫిర్యాదు చేయడంతో సభ్యురాలి వాటా ప్రకారం వ్యక్తిగత ఖాతాలో జమ చేసేలా బ్యాంకర్లకు అవకాశం ఇచ్చారు. ఈసారీ వ్యక్తిగత ఖాతాలకు జమ చేసేలా బ్యాంకర్లకు ఆదేశాలు వచ్చినట్లు తెలిసింది.

మూడో విడత జాప్యానికి కారణం అదేనా?

లబ్ధిదారులకు ఆసరా మొత్తాన్ని విడుదల చేసే విషయంలో ప్రతి సంవత్సరం జాప్యం చోటుచేసుకుంటోంది. మొదట విడత మొత్తాన్ని 2020 సెప్టెంబరులో, రెండో విడత మొత్తాన్ని 2021 అక్టోబరులో జమ చేశారు. మూడో విడత మొత్తం 2022లోనే ఇస్తారని అంతా భావించారు. ఆ తర్వాత సంక్రాంతి ముందు జమ చేస్తారనే ప్రచారం జరిగింది. ఫిబ్రవరి రెండో వారం వచ్చినా డబ్బులు ఎప్పుడు జమ చేస్తారో ప్రకటించకపోవడంతో అంతా ఎదురుచూస్తున్నారు. రైతుభరోసా, చేదోడు, విద్యా దీవెన పథకాలకు నిధులు విడుదల చేసిన క్రమంలో ఆసరా మూడో విడత జమ చేయడంలో జాప్యం జరిగి ఉండొచ్చన్న చర్చ అధికారిక వర్గాల్లో సాగుతోంది.

కన్వీనర్ల ద్వారా ప్రచారం

ప్రభుత్వం పలు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు డబ్బులు ఇస్తున్నా, ఆ స్థాయిలో ప్రచారం దక్కడం లేదన్న విషయాన్ని గుర్తించింది. దీంతో ఆసరా మూడో విడత నగదు జమ చేసే సమయంలో లబ్ధిదారులకు వివరించాలని నిర్ణయించింది. తద్వారా ప్రభుత్వానికి, పార్టీకి రాజకీయంగా లబ్ధి కలుగుతుందని భావిస్తోంది. ఇందుకోసం వాలంటీర్ల వెంట కన్వీనర్లను పంపాలని నిర్ణయించింది.

త్వరలో మూడో విడత డబ్బులు



ఆసరా మూడో విడత కింద స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులకు డబ్బులు జమ చేసేందుకు అవసరమైన మొత్తం ప్రక్రియ పూర్తి చేశాం. అర్హులైన సంఘాలు, సభ్యుల వివరాలను ఉన్నతాధికారులకు పంపాం. త్వరలో ప్రభుత్వం వారి ఖాతాల్లో నగదు జమ చేస్తుంది.

- డి.వి విద్యాసాగర్, డిఆర్‌డిఎ పీడీ



బాణాపురం రైతు భరోసా కేంద్రంలో సిబ్బందిని నిలదీస్తున్న రైతులు

ఆర్‌బికెకు రైతుల తాళం

ట్రక్కు సీట్లు ఇవ్వకపోవడంపై రైతుల ఆగ్రహం

ప్రజాశక్తి - మెళియాపుట్టి

ట్రక్కు సీట్లు ఇవ్వకపోవడంపై అన్నదాతలు ఆగ్రహించారు. మండలంలోని బాణాపురం రైతు భరోసా కేంద్రానికి శుక్రవారం రాత్రి తాళం వేసి నిరసన తెలిపారు. బాణాపురం రైతు భరోసా కేంద్రంలో 40 ట్రక్కు సీట్లు ఇవ్వాలని అధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. విషయం తెలుసుకున్న రైతులు మధ్యాహ్నం నుంచి ఆర్‌బికెలో ఉన్నారు. సాయంత్రం ఆరు గంటల సమయంలో ట్రక్కు సీట్ల లక్ష్యం అయిపోయిందని, నెట్ పనిచేయడం లేదని అగ్రికల్చర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్ బోర్డు పెట్టడంతో రైతులు కోపోద్రిక్తులయ్యారు. మధ్యాహ్నం నుంచి ఉన్న తమకు ట్రక్కు సీట్లు ఇవ్వాలని సిబ్బందిని నిలదీశారు. ట్రక్కు సీట్లు అయిపోయాయని, తామేమీ చేయలేమని అనడంతో వారిని ఆర్‌బికెలో ఉంచి బయట తాళం వేశారు. ఈ విషయాన్ని సిబ్బంది మండల వ్యవసాయాధికారి దానకర్ణుడుకు, పోలీసులకు ఫోన్ చేసి చెప్పారు. ఘటనా స్థలికి చేరుకున్న వారు రైతులకు నచ్చజెప్పి తాళం తీయించారు. ఎఒ దగ్గరుండి రైతులకు ట్రక్కు సీట్లు ఇచ్చారు.

వికలాంగ విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలి

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో పదోతరగతి వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల్లో వికలాంగులైన వారు తమ ధ్రువీకరణ పత్రాలను ప్రధానోపాధ్యాయుల ద్వారా డిఇఒ కార్యాలయానికి అందజేయాలని జిల్లా విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. రెండు జతల జిరాక్స్ ప్రతులను అందజేయాలని పేర్కొన్నారు. ధ్రువీకరణ పత్రాలు అందించిన వారికి మాత్రమే ప్రభుత్వం నుంచి రాయితీ ఉంటుందని స్పష్టం చేశారు. ఈనెల 15వ తేదీ లోగా అందజేయని వారికి రాయితీ పొందేందుకు అర్హత కోల్పోతారని తెలిపారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

125 మందికి రూ.80.10 లక్షలు

- కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్
- కళ్యాణమస్తు, షాదీతోఫా సాయం అందజేత

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో కళ్యాణమస్తు, షాదీతోఫా పథకం కింద ఎస్‌సి, ఎస్‌టి, బిసిలు 125 మందికి రూ.80.10 లక్షల ఆర్థికసాయాన్ని అందిస్తున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. వైఎస్ఆర్ కళ్యాణమస్తు, షాదీతోఫా పథకాలను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తాడేపల్లి నుంచి వర్చువల్ విధానంలో శుక్రవారం ప్రారంభించి బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా దరఖాస్తు చేసుకున్న వారిలో 41 మంది బిసి ఎ, 16మంది బిసి బి, 41 మంది బిసి డి, 25 మంది ఎస్‌సి, ఇద్దరు ఎస్‌టి లబ్ధిదారులకు నగదు జమ చేసినట్లు తెలిపారు. అక్టోబరు, నవంబరు, డిసెంబరులో వివాహాలు చేసుకున్న వారు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించినట్లు చెప్పారు. దరఖాస్తులను పరిశీలించి కళ్యాణమస్తు పథకం ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. వివాహ సర్టిఫికెట్లు సచివాలయంలోనే జారీ చేస్తారన్నారు. ప్రతి మూడు నెలలకోసారి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులైన దంపతులకు సాయం అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ డి.వి విద్యాసాగర్, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి వాసుదేవరావు, డిఆర్‌డిఎ ఎఒ దొర, సూపరింటెండెంట్ వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతలు ముందుకు రావాలి

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రక్తదానం చేసేందుకు రక్తదాతలు ముందుకు రావాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ పిలుపునిచ్చారు. నగరంలోని వ్యవసాయ శాఖ శాఖ కృషి భవన్‌లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యాన నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. వ్యవసాయశాఖ అధికారుల సంఘం సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో వ్యవసాయ శాఖ ఉద్యోగులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగులు స్వచ్ఛందంగా రక్తదాన శిబిరాలు నిర్వహించి రోగులను ఆదుకోవాలన్నారు.

రక్తదానం వల్ల రోగులకే కాకుండా ప్రమాద సమయాల్లో క్షతగాత్రుల ప్రాణాలు కాపాడేందుకు వీలవుతుందన్నారు. వ్యవసాయ, ఉద్యానశాఖ సహాయకులు, విత్తన, ఎరువుల డీలర్లు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రక్తదానం చేసిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు కె.శ్రీధర్, ఆత్మ పీడీ కె.కృష్ణారావు, వ్యవసాయ అధికారుల సంఘం అధ్యక్షులు వై.సురేష్, కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కోశాధికారి పి.రేవతి, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు పి.చైతన్య, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్



ధర్నా చేస్తున్న టోల్‌ప్లాజా కార్మికులు

15న నిరవధిక ధర్నా

- విశాఖ ఎన్‌హెచ్ కార్యాలయం వద్ద నిరసన
- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు
- కలెక్టరేట్ వద్ద టోల్‌ప్లాజా కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రోడ్డున పడిన చిలకపాలెం టోల్‌ప్లాజా కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 15వ తేదీన ఎన్‌హెచ్ఎఐ ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయం వద్ద నిరవధిక ధర్నా చేపట్టనున్నట్లు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు తెలిపారు. మూతపడిన చిలకపాలెం టోల్‌ప్లాజాలో 2007 నుంచి పనిచేస్తున్న 106 మంది కార్మికులకు మడపాం, నాతవలస టోల్‌ప్లాజాల్లో వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని సిఐటియు ఆధ్వర్యాన కార్మికులు కలెక్టరేట్ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టోల్‌ప్లాజా కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకుని సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఈనెల 15న విశాఖలోని జాతీయ రహదారుల కార్యాలయం ఎదుట నిరవధిక ధర్నా చేపట్టి వంటావార్పు కార్యక్రమం ద్వారా నిరసన తెలపనున్నట్లు తెలిపారు. చిలకపాలెం టోల్‌ప్లాజా ఏర్పాటైన నాటి నుంచి 106 మంది కార్మికులు విధుల్లో కొనసాగుతున్నారని చెప్పారు. గతేడాది డిసెంబరు 7వ తేదీన చిలకపాలెం టోల్‌ప్లాజాను ఎత్తివేసిన అధికారులు ఇక్కడి టోల్ వసూళ్లను నాతవలస, మడపాం టోల్‌ప్లాజాల్లో నేషనల్ హైవే అధికారులు సర్దుబాటు చేశారన్నారు.

ప్రభుత్వంలో చలనం లేదు

15 ఏళ్లుగా పనిచేస్తున్న 106 మంది కార్మికులను పట్టించుకోకుండా రోడ్డున పడేయడం అన్యాయమన్నారు. నేషనల్ హైవే అధికారులు తక్షణమే జోక్యం చేసుకుని 106 మంది కార్మికులను రెండు టోల్‌ప్లాజాల్లో సర్దుబాటు చేసి విధుల్లో కొనసాగించాలని డిమాండ్ చేశారు. గ్రాట్యుటీ, నష్టపరిహారం చెల్లించాలన్నారు. రోడ్డున పడిన కార్మికులను ఆదుకోవాలని, కార్మికుల సమస్యను పరిష్కరించాలని కోరుతూ అధికారులను, స్పీకర్, జిల్లా మంత్రి, ప్రజా ప్రతినిధులను కలిసి విన్నవించినా నేటికీ ప్రభుత్వంలో చలనం రాలేదని విమర్శించారు. కార్మికులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా టోల్‌ప్లాజాను ఎత్తివేసిన అధికారులు కార్మికుల భవిష్యత్‌ను పట్టించుకోకుండా రోడ్డున పడేశారని చెప్పారు. వారి కుటుంబాల జీవన స్థితిగతులను పట్టించుకోకపోతే ఎలా బతకాలని ప్రశ్నించారు.

దేశం కోసం సరిహద్దుల్లో కాపలా కాసిన మాజీ సైనికులపై ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఎంతవరకు సమంజసమన్నారు. ధర్నా అనంతరం కలెక్టరేట్ పరిపాలనాధికారి బి.రాజేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో చిలకపాలెం టోల్‌ప్లాజా ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు డి.వి నర్సింహులు, వి.వెంకటరమణ, ఎ.వి.ఆర్ మూర్తి, టి.అప్పారావు, పి.రాము, బి.రాజేశ్వరరావు, మురళి, శంకరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం దర్శనానికి ప్రత్యేక బస్సు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలం మల్లికార్జున స్వామి దర్శనార్థం శ్రీకాకుళం నుంచి శ్రీశైలంకు ప్రత్యేక బస్సును ఈనెల 17వ తేదీన నడుపుతున్నట్లు ఆర్‌టిసి శ్రీకాకుళం 1, 2 డిపో మేనేజర్లు తెలిపారు. ఆర్‌టిసి కాంప్లెక్స్‌లోని వారి ఛాంబర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 17న ఉదయం పది గంటలకు సూపర్ లగ్జరీ సర్వీసును సాధారణ ఛార్జీలతో నడుపుతున్నట్లు చెప్పారు. శ్రీశైలం వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం ముందస్తు రిజర్వేషన్ సౌకర్యంతో పాటు దర్శనం టిక్కెట్లు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. సర్వదర్శనం రూ.500, శీఘ్ర దర్శనం రూ.150, అతి శీఘ్ర దర్శనం రూ.300 రిజర్వేషన్లతో బుక్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 73829 21647, 73829 19694, 73829 21720 ఫోన్ నంబర్లను గానీ www.apsrtconline.in వెబ్‌సైట్ ద్వారా బుక్ చేసుకోవచ్చని తెలిపారు.

ధ్రువీకరణ పత్రాలను సిద్ధం చేసుకోవాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఈనెల 5వ తేదీన నిర్వహించిన జాతీయ ఉపకార వేతన పరీక్షకు హాజరైన అభ్యర్థులు వారి ధ్రువీకరణ పత్రాలను ఈనెల 20వ తేదీ లోగా సిద్ధం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వెలువడిన వెంటనే వాటిని డిఇఒ కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు వారి కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు 7వ తరగతి మార్కుల ధ్రువీకరణ పత్రం, వికలాంగ విద్యార్థులు అంగవైకల్య ధ్రువీకరణ పత్రం సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ఈ పత్రాల కోసం వెబ్‌సైట్‌లో పొందుపరిచిన వెంటనే పరీక్షల కార్యాలయం వెబ్‌సైట్ ద్వారా వాటిని అందజేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అందువల్ల వెబ్‌సైట్‌ను www.bse.ap.gov.inను తరచుగా గమనించాలని సూచించారు. జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం నుంచి ధ్రువీకరణ పత్రాలు కోరిన వెంటనే అందజేయాల్సి ఉంటుందని తెలిపారు. గడువులోగా అందించని వారిని తుది జాబితా నుంచి తొలగించనున్నట్లు పేర్కొన్నారు. దీనివల్ల ఉపకార వేతనం పొందడానికి అర్హత కోల్పోతారని తెలిపారు. తుది జాబితా విడుదల చేసిన తర్వాత అభ్యర్థనలు (స్పందన, కోర్టు, లోకాయుక్త వ్యాజ్యాలు) గానీ స్వీకరించడానికి వీలుండదని స్పష్టం చేశారు.

1,79,250 మందికి 'చేయూత' లబ్ధి

ప్రజాశక్తి - జలుమూరు

జిల్లాలో వైఎస్సార్ చేయూత పథకం ద్వారా మూడు విడతలుగా 45 నుంచి 60 ఏళ్ల లోపు 1,79,250 మంది మహిళలకు లబ్ధి చేకూరిందని డిపిఎం చింతాడ రామ్మోహనరావు చెప్పారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో సిఎఫ్‌లతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చేయూత పథకం ద్వారా మూడో విడతలో 26,423 మంది మహిళలకు అందజేసినట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా లబ్ధి పొందిన మహిళల యాక్టివిటీని గుర్తించి వారి వివరాలను అప్‌లోడ్ చేయాలని సూచించామన్నారు. వీరికి అవసరమైన ఆర్థికసాయాన్ని 'వెలుగు' ద్వారా అందజేస్తామన్నారు. మహిళల వ్యాపార అభివృద్ధికి చేయూత పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిపిఎం (ఐబి) మోహనరావు, ఏరియా కోఆర్డినేటర్ కొండలరావు, ఎపిఎం శ్రీనివాసరావు, సిసిలు, వెలుగు కార్యాలయ సిబ్బంది, సిఎఫ్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిపిఎం రామ్మోహనరావు

సాగులో అధునాతన పద్ధతులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వ్యవసాయరంగంలో అధునాతన సాంకేతిక పద్ధతులను వినియోగించడం ద్వారా రైతులకు ఎంతో ప్రయోజనమని రాగోలు వ్యవసాయ పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త పి.వి సత్యనారాయణ అన్నారు. ఆచార్య ఎన్‌జి రంగా విశ్వవిద్యాలయం, రాగోలు వ్యవసాయ పరిశోధనా కేంద్రం సంయుక్తంగా పలు పంటల సాగులో డ్రోన్ల వినియోగంపై అవగాహనా సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రోన్ ద్వారా మినుము, పెసర, వరి, మొక్కజొన్న పంటల్లో పురుగుమందులు, శిలీంధ్ర నాశనకారకాలు, పలురకాల పోషకాలను అందించడంపై అవగాహన కల్పించారు.

క్షేత్రస్థాయిలో డ్రోన్ పనితీరును రైతులకు, వ్యవసాయ కళాశాల విద్యార్థులకు వివరించారు. తక్కువ కాలంలో ఎక్కువ విస్తీర్ణంలో సమగ్ర పిచికారీ చేసేందుకు వీలుందని శాస్త్రవేత్తలు వివరించారు. క్రిమిసంహారక మందులు 25 శాతం తగ్గించి వినియోగించుకోవచ్చన్నారు. సదస్సులో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నేతాజీ, వ్యవసాయ పరిశోధనా కేంద్రం అధికారి శ్రీలక్ష్మి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ కె.భాగ్యలక్ష్మి, పి.ఉదయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



మహిళా మార్టు సందర్శన

శ్రీకాకుళం అర్బన్ : నగరంలో మెప్మా ఆధ్వర్యాన ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జగనన్న మహిళా మార్టును విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన మెప్మా బృందం సందర్శించింది. నగరంలోని రైతుబజారు సమీపాన ఉన్న ఈ మార్టు నిర్వహణ, క్రయవిక్రయాలు, ఇతర ప్రాంతాల నుంచి సరుకుల దిగుమతి, ప్యాకింగ్, అమ్మకాలను గుర్తించి సభ్యులతో చర్చించారు. వాటిపై అధ్యయనం చేసిన బృందాలు ఆయా జిల్లాల్లో మార్టుల ఏర్పాటుకు అనువైన పరిస్థితులు, అక్కడి ఉత్పత్తులను ఇతర జిల్లాలకు పంపించేందుకు అనువైన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. మార్టుల నిర్వహణలో సంఘాల సభ్యుల పాత్రపై చర్చించారు. మెప్మా పీడీ ఎం.కిరణ్ కుమార్ పలు అంశాలపై వివరించారు. కార్యక్రమంలో విజయనగరం మెప్మా పీడీ సుధాకర్, రెండు జిల్లాల మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

పత్రికా ప్రకటన

నా క్లైయింట్ అయిన **ఎల్ఐసి హౌసింగ్ ఫైనాన్స్ విజయనగరం** వారిచ్చిన బోగట్టు మేరకు ఈ కింది ప్రకటన ఇచ్చుచున్నాను.

శ్రీ నల్లా మోహన రావు S/o శ్రీనివాసరావు, లచ్చయ్యపేట వాస్తవ్యులు మా క్లైయింట్ వద్దకు హౌసింగ్ లోనుకి వచ్చారు. ఆయన డాక్యుమెంట్‌కి ఉన్న **2 లింకు డాక్యుమెంట్స్ 1) రిజిస్టర్ సేల్ డిడ్ 2010/2018 Dt 28.05.2018 ఎస్ఆర్ఓ పొందూరు** పోయాయి మరియు **2) రిజిస్టర్ సేల్ డిడ్ 4140/2014 Dt 29.12.2014 ఎస్ఆర్ఓ పొందూరు** కొద్దిరోజుల క్రితం ఆయన జర్నీలో పోయినవి అని చెప్పారు.

ఈ విషయం ఆ డాక్యుమెంట్ ఎవరు వద్ద కుదవగా ఉన్న ఎడల మా ఈ పబ్లికేషన్ ఇచ్చిన 10 దినములలో ఈ కింది అడ్రస్ వారికి రాతపూర్వంగా తెలియపరచవలెను. తదుపరి వచ్చిన అభ్యంతరములు చెల్లవు.

ఇట్లు
సి.యస్ భగవాన్,
అడ్వకేట్, విజయనగరం,
సెల్: 9441910030

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE SRIKAKULAM

E.A. 56/2022 IN E.P. 20/2021 IN O.S.261/2010

Between: **Potrunuru Thaviti Raju** ...Decreeholder

And: **Smt. Korada Lakshmi Kanthamma (Died)** ... Respondent / JDR/ Debtor

To.**Respondent Proposed Judgement Debtor No7:** Baratam Anitha, W/o Baratam Srikanth, house wife, Residang of Rajugari Street, C/o Baratam shopping mall, Perlakhemundi town, Gajapathi Dist, Odisha State.

డిక్రీహోల్డర్/వాది పై నెంబరు అమలు ఫిటిషన్ **Judgement Debtor/**ప్రతివాదిపై దాఖలు చేయడమైనది. సదరు **Judgement Debtor/**ప్రతివాది చనిపోయినందున మిమ్మలని మరియు అమె వారసులను పార్టీలుగా చేర్చమని ఫిటిషన్‌ను **E.A.56/2022** దాఖలు చేయగా మీకు నోటసు సర్వీసు గానందున పేపర్ పబ్లికేషన్ ద్వారా మీ నోటిసు నిమిత్తం తేది **20-02-2023** వాయిదా ఉన్నది. గనుక సదరు వాయిదాకు మీరు స్వయంగా గాని అడ్వకేట్ ద్వారా గాని కోర్టుకు పై తేదీన **ఉదయం 10.30 గం॥** లకు హాజరై మీకు గల అక్షేపణలు తెలియపర్చుకొనవలెను. లేని ఎడల మీ పరోక్షముగా విచారించి తీర్మానించడమగునని ఇందుమూలంగా తెలియపర్చడమైనది.

యెరుకోల మురళీ మోహన్‌రావు
డిక్రీ హోల్డర్ తరువున న్యాయవాది, శ్రీకాకుళం
ఫోన్: 9440105598

ప్రజా సంక్షేమం కోసమే గడప గడపకు

ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్


కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ప్రజాశక్తి - రణస్థలం

ప్రజా సంక్షేమం కోసమే గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు ఎచ్చెర్ల నియోజకవర్గ శాసనసభ్యులు గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని సంచాం పంచాయతీ పున్నాసపాలెం, పెసరపాలెం, తదితర గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు ఏయే వర్గాలకు, చేరుతున్నాయో ఎమ్మెల్యే ఆరా తీశారు. అనంతరం సచివాలయ సిబ్బంది, వాలంటీర్లతో సమావేశమై దిశానిర్దేశం చేశారు. ఏ ఒక్క అర్హుడికి పథకాలు రాకుండా ఉండే పరిస్థితి ఉండకూడదన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి టి.సీతారాం, మండల అధ్యక్షులు మహంతి పెద్దరామునాయుడు, జెసిఎస్ మండల ఇన్‌ఛార్జి చిల్ల వెంకటరెడ్డి, సర్పంచ్ మైలపల్లి కామరాజు, నాయకులు జి.అప్పలసూర్యనారాయణ, టెలికాం డైరెక్టర్ బడి రాంబాబు, సర్పంచ్ రెడ్డి సూర్యకాంతం, సర్పంచ్ ప్రతినిధి రెడ్డి రాము, ఎంపిడిఒ ధనుంజయరావు, ఎలక్ట్రికల్ ఎఇ శ్రీనివాసరావు, ఎపిఒ శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అరసవల్లిలో వైద్య శిబిరం


పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

శ్రీకాకుళం అర్బన్: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యాన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. జెమ్స్ ఆసుపత్రి డిజిఎం ఎస్ విజయభాస్కర్, డిప్యూటీ మేనేజరు ఎస్.శివప్రసాద్ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఆలయానికి వచ్చే యాత్రికులకు, ఆలయ సిబ్బందికి, అరసవల్లిలో నివాసం ఉంటున్న ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. బిపి, షుగర్, గుండె సంబంధిత వ్యాధులకు ఉచిత పరీక్షలు నిర్వహించారు. వ్యాధి నిర్ధారణ అనంతరం వారికి ఉచిత మందులతో పాటు ఆస్పత్రికి వెళ్లాల్సిన వారికి రిఫర్ చేశారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు, ఆలయ జూనియర్ అసిస్టెంట్ బి.ఎస్ చక్రవర్తి, జెమ్స్ ఆస్పత్రి ఏరియా మేనేజర్ బి.రవి, పిఆర్ఒలు మహేష్ పాల్గొన్నారు.

వెట్టిచాకిరీ నిర్మూలనపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న సూర్యనారాయణ

సోంపేట: వెట్టిచాకిరీ నిర్మూలన చట్టంపై కార్మికులకు సోంపేట సహాయ కార్మిక అధికారి సూర్యనారాయణ అవగాహన కల్పించారు. శుక్రవారం జె.కె. నాయుడు ఇసుక బట్టీలు, సోంపేట పట్టణంలోని పలు వర్తక దుకాణాల్లో కార్మికులకు ఈ చట్టంపై అవగాహన కల్పించారు. పని వేళలు పాటించాలని, వేతన చట్టం ప్రకారం వేతనాలు అందించాలన్నారు. ఈ నిబంధనలు అమలు చేయకపోతే యజమానులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. 18ఏళ్లలోపు వయస్సున్న పిల్లలకు పనిలో పెట్టుకోకూడదన్నారు. వెట్టి చాకిరీ చట్టంపై అందరూ అవగాహన కల్పించుకోవాలని, అప్పుడే తమ హక్కులు పొందగలరని అన్నారు. కార్యక్రమంలో వ్యాపార సంస్థల నిర్వాహకులు, కార్మికులు పాల్గొన్నారు.

వాహ్.. శ్యామ్

కవిటి: ప్రముఖ సంగీత దర్శకుడు తమన్ టీములో పనిచేసే వయోలిన్ ప్లేయర్ శ్యామ్ శుక్రవారం రామయ్యపుట్టుగలో సందడి చేశారు. ఎమ్మెల్యే అశోక్ సోదరుడి వివాహ వేడుకలో శ్యామ్ తన సహచరులతో కలిసి ఇచ్చిన ప్రదర్శన ఆహూతులను తన్మయత్వంలో ముంచెత్తింది. వయోలిన్, గిటార్, డ్రమ్స్‌తో శ్యామ్ టీమ్ ఇచ్చిన పదర్శన నభూతో నభవిష్యత్ అనిపించింది. అనంతరం ఎమ్మెల్యే అశోక్ శ్యామ్ టీముని ఘనంగా సన్మానించారు.

సంక్షిప్త వార్తలు

వృద్ధుని మృతిపై దర్యాప్తు


రికార్డులను పరిశీలిస్తున్న అలివేలు మంగమ్మ

మెళియాపుట్టి: మండలంలో మామిడిగుడ్డి గ్రామానికి చెందిన గిరిజన సవర బారికి గురువారం మృతి చెందాడు. ఈయన మృతిపై డిఎల్‌పిఒ అలివేలు మంగమ్మ శుక్రవారం దర్యాప్తు చేపట్టారు. ఆయనకు వృద్ధాప్య పింఛను ఆగిపోయిందని, కుటుంబసభ్యులు ఎవరూ లేక, దీనావస్థలో మృతి చెందినట్లు పలు పత్రికల్లో వచ్చిన వార్తకు ఆమె దర్యాప్తు జరిపారు. పెద్ద పద్మాపురం సచివాలయంలో వృద్ధునికి సంబంధించిన పింఛను వివరాలను ఆమె పరిశీలించారు. ఉన్నతాధికారులకు వివరాలను నివేదిస్తామన్నారు. ఆమెతో పాటు ఎంపిడిఒ పి.చంద్రకుమారి, పంచాయతీ కార్యదర్శి సిహెచ్ అప్పారావు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

బకాయి జీతాలు చెల్లించాలి

టెక్కలి రూరల్: మండలంలోని టీచర్లకు జనవరి జీతాలు జమ కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని ఎపి టీచర్స్ ఫెడరేషన్ టెక్కలి మండలశాఖ గౌరవాధ్యక్షులు గున్న ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి నెలా 1వ తేదీన చెల్లించాల్సిన జీతాలు, పెన్షన్లు జాప్యం కావడం విచారకరమని పేర్కొన్నారు. దైనందిన ఖర్చులు, మందులు, అద్దెలు, కిరాణా, ఇతర అవసరాలకు డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నారని, తక్షణమే ప్రభుత్వం జీతాలు చెల్లించాలని కోరారు.

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - కొత్తూరు

ఐసిడిఎస్ పరిధిలోని అంగన్వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసిడిఎస్ పిఒ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని కుద్దిగాం ఆయా పోస్టు ఒసి, హిరమండలం మండలం కొండరాగోలు ఆయా పోస్టు ఒసికి కేటాయించినట్లు తెలిపారు. ఈ నెల 11 నుంచి 18వ తేదీ వరకు దరఖాస్తులను ఐసిడిఎస్ కార్యాలయానికి అందజేయాలని కోరారు. పూర్తి వివరాలకు తమ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

కుష్టు రహిత సమాజం నిర్మిద్దాం


అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

వజ్రపుకొత్తూరు: కుష్టు రహిత సమాజం నిర్మించడానికి ప్రతి ఒక్కరికీ కుష్టు వ్యాధి నివారణపై అవగాహన అవసరమని అక్కుపల్లి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ విజయకుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం అక్కుపల్లి బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. శరీరంపై ఎటువంటి మచ్చలు కనిపించినా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ వ్యాధి అంటే అపోహ, భయం వీడాలన్నారు. శరీరంపై స్పర్శలేని మచ్చలు ఉంటే వైద్యులను సంప్రదిస్తే చికిత్స ద్వారా అంగవైకల్యం బారిన పడకుండా కాపాడవచ్చున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.పాపారావు, వైస్ ప్రిన్సిపాల్ కుమారి, ఉపాధ్యాయులు ఉష, ప్రశాంతి, శ్రీలక్ష్మి, పద్మ, పార్వతి పాల్గొన్నారు.

డి.గొనపపుట్టుగలో అన్నదానం

ప్రజాశక్తి - కవిటి

మండలంలోని డి.గొనపపుట్టుగ గ్రామంలో శుక్రవారం అన్నదానం చేపట్టారు. శ్రీ గోకర్ణేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కుంకుమ పూజ చేశారు. కార్యక్రమంలో మహిళలు, యాత్రికులు పాల్గొన్నారు.

బమ్మిడిలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'


ర్యాలీగా వెళ్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - కొత్తూరు

మండలంలోని బమ్మిడి గ్రామంలో ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పాతపట్నం మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో టిడిపిని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు చింతాడ కోటేశ్వరరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మండల అధ్యక్షుడినీ మార్చేద్దాం!

- పావులు కదుపుతున్న టిడిపిలోని ఓ గ్రూపు
- వైసిపికి అనుకూలంగా నిర్ణయాలు

ప్రజాశక్తి - టెక్కలి

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న టెక్కలి నియోజకవర్గంలోని టిడిపి టెక్కలి మండల అధ్యక్షులు బగాది శేషగిరిని కూడా మార్చేందుకు ఆ పార్టీలోని ఓ గ్రూపు చురుకుగా పావులు కదుపుతున్నట్లు తెలిసింది. మండల అధ్యక్షునికి నమ్మిన బంటులుగా ఉన్న ఇద్దరు కార్యకర్తలను క్రమశిక్షణా చర్యలు కింద పార్టీ కార్యక్రమాల నుంచి తప్పుకోవాలని స్వయంగా అచ్చెన్నాయుడుతో చెప్పించడం విశేషం. ఈ విషయంలో వారు విజయం సాధించారు. అక్కడితో వారు ఆగకుండా మండల అధ్యక్షుడిని ఆ పదవి నుంచి తప్పించేందుకు పట్టు పడుతున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. అందులో భాగంగా కింజరాపు అచ్చెన్నాయుడు మంత్రిగా ఉన్న సమయంలో ఆయనకు ముఖ్య అనుయాయునిగా ఉంటూ.. పట్టణ వర్తక, వ్యాపార సంఘాలకు అధ్యక్షులుగా పని చేశారు. ఆయనే ఈ వ్యవహారానికి సూత్రదారునిగా ఉన్నట్లు తెలిసింది. ఈయన టెక్కలి నియోజకవర్గంలో వైసిపి చెందిన ముఖ్యనాయకులు, ద్వితీయ శ్రేణి నాయకులు ఇస్తున్న డైరెక్షన్‌లో నడుస్తున్నట్లు తెలిసింది. ఆ మేరకు సొంత పార్టీలోనే చిచ్చు పెడుతున్నట్లు సమాచారం. ఇరు పార్టీల్లోనూ మంచిగా ఉంటూ తనపై ఉన్న కేసులను, రౌడీ షీటల్‌ను మాఫీ చేసుకుంటున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా కింజరాపు అచ్చెన్నాయుడు రాష్ట్ర రవాణాశాఖ మంత్రిగా ఉన్న సమయంలో టెక్కలి ఆర్టీసీ కాంప్లెక్స్‌ను తన పేరుపై మార్చుకున్నాడు. ఈ వ్యవహారంపై నాడు వైసిపి నాయకులు ఆందోళన చేశారు. ప్రజా ఆస్తులను ఓ వ్యక్తికి కట్టబెట్టడం ఏమిటని వైసిపి నాయకులు దుమ్మెత్తి పోశారు. ఇప్పుడు ప్రస్తుతం వైసిపి అధికారంలో ఉంది. ఆ వ్యక్తిపై చర్యలు తీసుకునే అవకాశం ఉన్నా.. చీకటి ఒప్పందాల కారణంగా ఆయనను ఏమీ చేయడం లేదని తెలిసింది. ఆర్టీసీ కాంప్లెక్స్ వ్యవహారంపై మౌనం దాల్చడంలో గల ఆంతర్యం ఏమిటని ఇటు వైసిపి, అటు టిడిపి నాయకులు బాహాటంగానే వ్యాఖ్యానించడం విశేషం. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు కూడా టిడిపి నాయకుల ఆలోచనలకు అద్దం పట్టేలా ఉండటంతో మండల అధ్యక్షుడిని మార్చినా ఆశ్చర్యపోనక్కర్లేదని చెప్పుకొస్తున్నారు.

కింజరాపు అచ్చెన్నాయుడు పక్షాన నిలిచిన, ఆయనకు మద్దతుగా చేసిన కార్యక్రమాల్లో పోలీసు కేసులకు గురయ్యారు. కష్టకాలంలో పార్టీని, నాయకుడిని ఆదుకున్న వారిపైనే క్రమశిక్షణ చర్యలు తీసుకునే వైఖరిని పలువురు ఖండిస్తున్నారు. మండల అధ్యక్షుడిని తప్పించి, ఆ స్థానంలో తన కుటుంబ సభ్యుల్ని పెట్టించుకోవాలని నందిగాం మండలానికి చెందిన ఒక నాయకుడు ఆలోచించడం గమనార్హం. పార్టీ కార్యకర్తలపై క్రమశిక్షణా చర్యలు తీసుకునే క్రమంలో నందిగాం మండలానికి చెందిన సదరు నాయకుడు కూడా కింజరాపుపై ఒత్తిడి తెచ్చినట్లు తెలిసింది. ఏదిఏమైనా టెక్కలి టిడిపిలో అంతర్గత కుమ్ములాటల వ్యవహారం టిడిపి నష్టదాయకంగా..., వైసిపికి లాభం చేకూర్చులా ఉందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. తాను చేసిన తప్పును అచ్చెన్న సరిదిద్దుకుంటారో, లేక వైసిపి వేసిన పావులకు కీలుబొమ్మ అవుతారో వేచి చూడాల్సి ఉంది.

కాన్‌కాస్ట్ కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సువ్వారి గాంధీ


మాట్లాడుతున్న సువ్వారి గాంధీ

ప్రజాశక్తి - ఆమదాలవలస

కాన్‌కాస్ట్ పరిశ్రమ కార్మికుల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని వైసిపి రాష్ట్ర జాయింట్ కార్యదర్శి సువ్వారి గాంధీ అన్నారు. శుక్రవారం పురపాలక సంఘం పరిధిలోని బొడ్డేపల్లిపేటలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1990లో మండలంలోని దూసి గ్రామం వద్ద ఈ పరిశ్రమను 50 ఎకరాల్లో ఏర్పాటు చేశారని, 1998-99లో అప్పటి టిడిపి అనాలోచిత నిర్ణయాల వల్ల ఐదు సంవత్సరాల పాటు పరిశ్రమను మూసి వేశారని అన్నారు. 2004లో వైఎస్ఆర్ హయాంలో పరిశ్రమను పున ప్రారంభించినట్లు తెలిపారు. మరలా టిడిపి అనాలోచిత నిర్ణయాల వల్ల 2017లో పరిశ్రమను మూసివేశారని అన్నారు. దీంతో 700 మంది కార్మికులు రోడ్డున పడ్డారని అన్నారు. అప్పటి ఎమ్మెల్యే కూన రవికుమార్ పరిశ్రమ మూతపడకుండా అడ్డుకోవడంలోనూ, కార్మికుల హక్కులను కాపాడటంలో విఫలమయ్యారని అన్నారు. కార్మికులకు రావాల్సిన ఆరు నెలల వేతనాలు, పిఎఫ్, ఇతర బకాయిలు ఇప్పించకుండా గాలికి వదిలేశారని విమర్శించారు. కార్మికులు ఈ సమస్యను తన దృష్టికి తేవడంతో గతేడాది ఆగస్టులో సిఎం దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారని అన్నారు. సిఎంఒ ఆదేశాల మేరకు కార్మికశాఖ అధికారులు విఆర్ గూడెంలోని తన గృహానికి వచ్చి, చర్చించారని తెలిపారు. నాలుగు రోజుల క్రితం కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్ కార్యాలయానికి కార్మికులతో కలిసి వెళ్లి, వారి సమస్యలను విన్నవించినట్లు చెప్పారు. కార్మికులకు రావాల్సిన ప్రతి ఒక్క పైసా వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పేడాడ వైకుంఠరావు, చింతాడ శివకుమార్, పైడి విజయరమణారావు, గురుగుబిల్లి రాజశేఖర్, పి.ఆదినారాయణ, బొడ్డేపల్లి మోహన్, కాన్‌కాస్ట్ పరిశ్రమ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మద్యం అక్రమంగా తరలింపు


సీజ్ చేసిన మద్యం, మూడు బైకులతో ఎక్సైజ్ అధికారులు

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఒడిశా నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న ఐదుగురిని అరెస్టు చేసి, మూడు బైక్‌లను సీజ్ చేసినట్లు ఎక్సైజ్ అధికారులు శుక్రవారం తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నాటుసారా, మద్యం అక్రమ రవాణాపై దృష్టి సారించినట్లు చెప్పారు. పాత టోల్‌గేట్ వద్ద సాయికుమార్ బెహరా, కామరాజు ద్విచక్రవామనంతో మద్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు చెప్పారు. కొజ్జిరియ జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా రెండు దిచక్ర వాహనాల్లో ఐదు బీరు టిన్‌లు తరలిస్తున్న డి.వెంకటరమణ, బడియ వెంకటరావును అరెస్టు చేసినట్లు చెప్పారు. బూర్జపాడు గ్రామానికి చెందిన శివాంగి మాధవరావు నాటు సారా అమ్మకాలు చేస్తుండగా అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈ దాడులో అరెస్ట చేసిన ఐదుగురిని పలాస కోర్టులో హాజరుపరిచనట్లు చెప్పారు. ఈ దాడుల్లో సిఐ రాజులనాయుడు, ఎస్ఐలు ఎస్.గురుమూర్తి, ఎస్.ముసలినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న చిక్కాలవలస రైతులు

ధాన్యం కొనాలని రైతుల నిరసన

పోలాకి : పండించిన ధాన్యం కొనుగోలు చేయాలని నరసన్నపేట మండలం చిక్కాలవలస రైతులు ఆర్‌బికె వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ ముంజి శ్రీరాములు, రైతులు మాట్లాడుతూ మా పంచాయతీలో చిక్కాలవలస, మామిడివలస, కుద్దాం గ్రామంలో సుమారు 900 బస్తాల ధాన్యం నిల్వ ఉన్నాయని అన్నారు. వాటిని అధికారులు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అధికారులను అడిగితే మాకు విధించిన లక్ష్యం మేరకు కొనుగోలు చేశామని చెబుతున్నారని, రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని ఎవరు కొంటారని ప్రశ్నించారు. ప్రభుత్వం స్పందించి ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

రికార్డులు పరిశీలన


రికార్డులను పరిశీలిస్తున్న నిత్యానందం

ప్రజాశక్తి - పలాస

పంచాయతీరాజ్ కార్యాలయంలో శుక్రవారం టెక్కలి డివిజన్ టెక్నికల్ అధికారి పి.నిత్యానందం కార్యాలయ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వపరంగా చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు సంబంధించిన రికార్డులను పరిశీలించామన్నారు. ఈ ప్రక్రియ ఎప్పటికప్పుడు జరుగుతుందని, అందులో భాగంగానే కార్యాలయాన్ని సందర్శించి, రికార్డులను పరిశీలించామని చెప్పారు. ఆయనతో పంచాయతీ రాజ్ డిఇఇ జి.రవిబాబు, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారం అందించాలి

బూర్జ: విద్యార్థులు, గర్భిణులకు సజావుగా పౌష్టికాహారం అందించాలని వైస్ ఎంపిపి బుడుమూరు సూర్యారావు అన్నారు. శుక్రవారం మండలంలోని ఓవిపేట మినీ అంగన్వాడీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. గర్భిణులు, బాలింతలతో ఆయన మాట్లాడారు. అంగన్వాడీ కేంద్రం నుంచి గుడ్లు, పౌష్టికాహారం పంపిణీపై ఆరా తీశారు. అంగన్వాడీ సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మెట్ట అమ్మాజమ్మ, యరగడ పాపయ్య, ఎ.రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

రేపు బొడ్డపాడు యువజన సంఘం వార్షికోత్సవం


సమావేశంలో మాట్లాడుతున్న క్రాంతి

ప్రజాశక్తి - పలాస

సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణే లక్ష్యం అని బొడ్డపాడు యువజన సంఘం అధ్యక్ష, కార్యదర్శి తామాడ క్రాంతి, బొడ్డు యుగంధర్ అన్నారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. నాడు సమాజంలో ఉన్న అసమతలు, అశ్లీలత, మద్యం దురాగతాలను అరికట్టేందుకు 1954లో ఈ సంఘం ఏర్పడిందని చెప్పారు. నాటి నుంచి నేటి వరకు ఈ ప్రాంత విద్యాభివృద్ధికి కృషి చేస్తూ 69 వసంతాలలోకి అడుగుపెడుతోందని చెప్పారు. బొడ్డపాడులోని అమరవీరుల సంస్మరణ మందిరంలో యువజన సంఘం సభ్యులు ఈ నెల 12న నిర్వహించే బొడ్డపాడు యువజన సంఘం 69వ వార్షికోత్సవం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ యువజన సంఘంపై మహారాష్ట్రకు చెందిన గాంధీ మెమోరియల్ రీసెర్చ్ సభ్యులు పరిశోధన చేసి ఈ సంఘం విశిష్టతను దేశ నలుమూలలు తెలియజేస్తారని తెలిపారు. ప్రజలకు అండగా ఉంటూ ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ ఉత్తరాంధ్ర కళలతో పాటు, కళారంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. 69వ వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన అరుణోదయ విమలక్క ఆధ్వర్యంలో సంస్కతిక కార్యక్రమాలతో పాటు సిక్కోలు జానపద గాయకులతో జానపద కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వార్షికోత్సవ వేడుకల్లో రైతు కూలీ సంఘం నాయకులు తాండ్ర ప్రకాష్, మానవ హక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కామ్రేడ్ హెచ్ఆర్ జగన్నాథం, పర్యావరణ పరిరక్షణ సమితి అధ్యక్షులు డాక్టర్ వై.కృష్ణమూర్తి, తదితరు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో కె.ఢిల్లీరావు, గుజ్జు దశరథరావు, తామాడ గంగయ్య, జి.జానకిరామ్, త్రిలోచనరావు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాంత్‌కు అభినందన


శ్రీకాంత్‌ను అభినందిస్తున్న ఆనందబాబు

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

ఆల్ ఇండియా ట్రెడిషనల్ యోగాసన ఛాంపియన్‌షిప్ ఆధ్వర్యాన ఒడిశా రాష్ట్రం పూరిలో ఈనెల 4,5 తేదీల్లో నిర్వహించిన పోటీల్లో శ్రీకాంత్ మహంతి సత్తా చాటాడు. సీనియర్స్ బాలురు విభాగంలో ప్రథమ స్థానం సాధించాడు. ఈ సందర్భంగా మహంతిని విజయనగరంలోని పోలీస్ ట్రైనింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్, ఎస్‌పి టి.ఆనంద్‌బాబు ప్రత్యేకంగా ఆహ్వానించి అభినందించారు. యోగా క్రీడలో మరెన్నో పథకాలు సాధించి, దేశానికి, రాష్ట్రానికి మంచిపేరు తేవాలని ఆనంద్‌బాబు కోరారు.

ఆధార్ డ్రైవ్‌కు విశేష స్పందన

ప్రజాశక్తి - జి.సిగడాం

మండలంలోని కెజిబివి, మోడల్ స్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన ఆధార్ డ్రైవ్‌కు విశేష స్పందన లభించిందని ఆధార్ నిర్వాహకులు లావణ్య, పి.రాము తెలిపారు. ఆధార్ సంబంధిత సమస్యలను ఇక్కడ పరిష్కరించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఆధార్ అప్‌డేట్ కోసం, ఫోన్ నెంబర్ ఆధార్ లింక్ కోసం, పేర్లు, పుట్టిన రోజు కోసం ఎక్కువ మంది మార్పు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కెజిబివి హెచ్‌ఎం ఉషారాణి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అన్నా శామ్యూల్ లంక, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వేచ్ఛావతి విగ్రహ మండపానికి భూమి పూజ

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం మెయిన్ రోడ్డు వద్ద సింహద్వారం వద్ద నూతనంగా నిర్మించనున్న స్వేచ్ఛావతి అమ్మవారి విగ్రహ మండపానికి ఎపి మారిటైం బోర్డు అధ్యక్షులు కె.వెంకటరెడ్డి ప్రతినిధి టి.ఆదిరెడ్డితో కలిసి మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి, సంతోష్ దంపతులు, కౌన్సిలరు తాడి ఆది భూమి పూజ చేశారు. ఈ విగ్రహ మండపానికి కాయల వెంకటరెడ్డి రూ.7 లక్షలు ఆర్థిక సాయం చేశారు. మెయిన్‌రోడ్డు మీదుగా వెళ్లే ప్రజలు దర్శనార్థం ఈ మండపం ఉపయోగపడేలా ఆలయ కమిటీ చర్యలు తీసుకుంది. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన పరీక్షలు

ప్రజాశక్తి - టెక్కలి

ప్రభుత్వ పాఠశాల్లో, అనుబంధ పాఠశాలల్లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఎఫ్ఎ-3 పరీక్షలు నేటితో ముగిశాయి. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు ఈ నెల 8వ తేదీ నుంచి పరీక్షలు పెట్టారు. రోజుకు రెండు పరిక్షలు చొప్పున నిర్వహించారు. సిబిఎ విధానంలో నిర్వహించిన ఈ పరీక్షల సందర్భంగా సమాధానపత్రాలు పూర్తిగా ఒఎంఆర్ విధానంలోనే నిర్వహించారు. కొన్ని పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం అమలవుతున్న నేపథ్యంలో విద్యార్థులకు ఇచ్చే ప్రశ్నాపత్రాన్ని రెండు మాధ్యమాల్లో అందించారు. విద్యార్థులు నింపిన ఒఎంఆర్ షీట్‌ను ఆయా మండల విద్యాశాఖాధికారులకు శుక్రవారం సాయంత్రం నాటికి అందించారు. ఎంఇఒ ద్వారా జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి ఒఎంఆర్ షీట్‌లు పంపబడ్డాయి.

ఆకట్టుకున్న వ్యవసాయ యాంత్రిక మేళా

ప్రజాశక్తి - పర్లాకిమిడి

పర్లాకిమిడిలో శుక్రవారం ఏర్పాటు చేసిన వ్యవసాయ యాంత్రిక మేళాను మోహన నియోజకవర్గ ఎమ్మెల్యే భగీరథ గొమాంగో ప్రారంభించారు. జిల్లా పరిషత్ అధ్యక్షులు గవర తిరుపతి, అదనపు జిల్లా అధికారి సంగ్రామ శేఖర్ పండా మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి అవసరమైన వివిధ యాంత్రిక పనిముట్లను సబ్సిడీ ధరకు ప్రభుత్వం అందిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయదారులకు రూ.2 లక్షల వరకు వడ్డీలేని రుణాలను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. గతంలో వ్యవసాయ యాంత్రిక పరికరాలను ఒక పరిధి వరకే ఇచ్చేవారని, ఇకముందు అటువంటి పరిధి ఏమీ ఉండదని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యవసాయ యాంత్రిక మేళా ఆకట్టుకుంది.

రూ.25 లక్షల పరిహారం చెల్లించాలి


నిరసన తెలుపుతున్న వ్య.కా.స నాయకులు

వజ్రపుకొత్తూరు: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఉపాధి కూలీలకు రూ.25 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని వ్యకాస జిల్లా నాయకులు దుబ్బ భానుమతి, భాస్కరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంపల్లిలో వారు విలేకరులతో మాట్లాడారు. ఇటీవల ఆమదాలవలస సమీపంలో లారీ ఢీకొనడంతో నలుగురు ఉపాధి కూలీలు మృతి చెందారని, వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్ర బడ్జెట్‌లో ఎన్ఆర్ఇజిఎస్‌కు నిధుల కేటాయింపులో కోత విధించడం దారుణం అన్నారు. రూ. 89 వేల కోట్ల నుండి రూ. 60వేల కోట్లకు తగ్గించడంపై ఆందోళన వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో రూ.లక్ష కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బమ్మిడి రామకృష్ణ, ఎస్.సరోజనమ్మ, బి.హిందువతి, బి.లక్ష్మి, ఎస్.పుష్పలత, బి.సాయమ్మ, ఎస్.హేమలత పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

ప్రజాశక్తి - పలాస

విద్యార్థులు చదువుతోపాటు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని మాజీ ఎంపీ డాక్టర్ కణితి విశ్వనాథం అన్నారు. చినబడాం సాయి శిరీషా హైస్కూల్‌లో విద్యార్థులకు పలాస-కాశీబుగ్గ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం 310 విద్యార్థులకు టైఫాయిడ్ వ్యాక్సిన్ వేశారు. ఆయన మాట్లాడుతూ వ్యాక్సిన్ తీసుకోవడం వల్ల మూడు సంవత్సరాలు వరకు టైఫాయిడ్ జ్వరం రాకుండా నిరోధించవచ్చున్నారు. కార్యక్రమంలో సాయి శిరీష హైస్కూల్ కరస్పాండెంట్ కవిటి భారతి, లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఎన్.అప్పారావు, సెక్రటరీ తమ్మినాన మాధవరావు, తెప్పల కృష్ణమూర్తి, కుమార్‌నాయక్, కణితి హేమాచలం, కెపి.రామన్న, ఆర్.హేమాచలం, తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఆటో కార్మికుడు లెంకా మధుసూదనరెడ్డి కుటుంబానికి యూనియన్ ప్రతినిధులు రూ.50వేలు ఆర్థిక సహాయం అందించారు. సహచరా ఆటో కార్మికుడు మృతితో కుటుంబం ఆర్థిక ఇబ్బందులు పడకుండా తమవంతు సహకారం అందించాలని యూనియన్ నిర్ణయించినట్లు చెప్పారు. దీంతో శుక్రవారం యూనియన్ నాయకులు బాధిత కుటుంబానికి చెందిన తల్లిదండ్రులు రామయ్య, గంగమ్మకు పై మొత్తం అందించారు. మానవత్వం చాటారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటికీ తాగునీరు


పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్

కవిటి: ప్రభుత్వం ప్రతి ఇంటికీ ట్యాపుల ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందిస్తుందని డి.గొనపపుట్టుగ సర్పంచ్ బెందాళం కిరణ్‌కుమారి తెలిపారు. ఇంటింటికీ ట్యాపుల ఏర్పాటు చేసే పనులను శుక్రవారం సర్పంచ్ ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ ఉద్దానం ప్రాంతంలో స్వచ్ఛమైన తాగునీరు అందించే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తున్నట్లు తెలిపారు. తొందరలోనే పనులు పూర్తి చేసుకుని ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి బెందాళం జయప్రకాష్, ఎంపిటిసి చందాన పూర్ణ చంద్రుడు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎన్నికల అధికారి సవరమ్మ

రెండు రోజుల్లో ఓటరు నమోదు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - పొందూరు

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీకి సంబంధించిన నూతన ఓటరు నమోదు ప్రక్రియ రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఆమదాలవలస నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి టి.సవరమ్మ బిఎల్‌ఒలను ఆదేశించారు. శుక్రవారం పొందూరు తహశీల్దార్ కార్యాలయం సమావేశ మందిరంలో బిఎల్‌ఒలు, ఎన్నికల అధికారులు, మండల అధికారులతో సమీక్ష నిర్వహించారు. మరణించిన ఓటర్లను, అనర్హులను ఓటరు జాబితా నుంచి తొలగించాలని ఆదేశించారు. ఓటు ఆధార్‌కు అనుసంధాన ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించిన పది మంది బిఎల్‌ఒలకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని తహశీల్దార్ రాంబాబును ఆదేశించారు. ఈ సమీక్షలో ఎలక్షన్ డిటి నాయక్, మండల అధికారులు పాల్గొన్నారు.

మూడు రోజులకే పెచ్చులూడిన కాలువ


పెచ్చులూడిన కాలువ

ప్రజాశక్తి - బూర్జ

మండలంలోని కొరగాంలో రహదారికి ఇరువైపులా నిర్మించిన కాలువల్లో నాణ్యతా లోపం కనిపిస్తోంది. నిర్మించిన మూడు రోజులకే పెచ్చులూడుతున్నాయి. కాలువల్లోని మురుగునీరు రోడ్లపైకి వస్తోందని గ్రామస్తులు అసహనం వ్యక్తం చేశారు. ఆర్‌డబ్ల్యుఎస్ జెఇఇ కెవికె.నాయుడు మాట్లాడుతూ కాలువ పనులు పూర్తి కాలేదని, నాణ్యత పాటించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

హనుమాన్ విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన

పలాస: బ్రాహ్మణతర్ల విశాఖకు చెందిన విజయలక్ష్మి కనస్ట్రక్షన్స్ అధినేత సిల్లా ప్రసాద్‌దొర, జయలక్ష్మి దంపతులు హనుమాన్ విగ్రహ నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ చేశారు. తనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులకు, జన్మస్థలమైన బ్రాహ్మణతర్లను ఎప్పటికీ మర్చిపోలేనని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయికృష్ణ, పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు, చిట్టిబాబు, సర్పంచ్ బాడాన పుష్ప, ఎంపిటిసి తుంగాన రవణమ్మ, దంతం వైకుంఠరావు, పొందర ఈశ్వరరావు, పొట్నూరు మురళీకృష్ణ, కర్ర గంగాధరరావు, పొట్నూరు తారకరామారావు, గరికి ధర్మారావు, ఆనం రామారావు, నిర్మల్‌కుమార్, బ్రహ్మ తదితరులు పాల్గొన్నారు.